క్లుప్తంగా

నేడు ఆర్టీసీ కార్మికుల జీపుజాతా

నయీంనగర్: ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన పీఆర్సీ, సీసీఎస్ బకాయిలు చెల్లించాలని, ఆర్టీసీని రక్షించాలని, బస్సులు కొనుగోలు చేసి పల్లెల్లో నడపాలని, ప్రజా రవాణాను మెరుగు పరచాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈమేరకు డిమాండ్ల సాధనకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ డిపో, హనుమకొండ డిపోల్లో ఆదివారం సాయంత్రం జీపుజాతా నిర్వహిస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘాలకు అతీతంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గురుకులంలో డీఐఈఓ పరిశీలన



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఐఈఓ గోపాల్

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనార్టీ బాలికల ఇంగ్లిష్ మీడియం గురుకులాన్ని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) గోపాల్ శనివారం పరిశీలించారు. ఇంటర్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షల నిమిత్తం సెంటర్ ఏర్పాటు కోసం గురుకులంలో ఉన్న ల్యాబ్, ఇతర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ హరిలాల్, ప్రిన్సిపాల్ ముత్తిరెడ్డి నీరజ, అధ్యాపకురాలు వాసవి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న డాక్టర్ ప్రమీల

ఖిలా వరంగల్: వరంగల్ ఎస్ఎస్ఆర్‌తోటలోని ప్రభుత్వ సహాయ సరస్వతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. మేరుగు మల్లికాంబ కాంతయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు మేరుగు సురేందర్‌తో కలిసి పాఠశాల పాలకవర్గ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కస్తూరి ప్రమీల చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు రామరాజు, పాటి రవీందర్, రాజారపు మిత్ర, వడ్లకొండ సరస్వతి, కక్కెర్ల పారిజాతం, నూరుజహా, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వంతో అమరత్వం



హసన్‌పర్తి: వ్యక్తి మరణించిన తర్వాత మృతుడి అవయవాలను బాధిత కుటుంబాలు మానవత్వంతో దానం చేసినట్లయితే సదరు వ్యక్తికి అమరత్వం సిద్ధిస్తుందని తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు వద్ద రాజేందర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అవయవ దానంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో అవయవ దానం గొప్పదని కొనియాడారు. నేత్ర దానంతో అంధుల్లో వెలుగు నింపవచ్చని, అవయవదానం.. భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా మరణాంతరం అవయవదానం చేస్తామని కార్యక్రమానికి హాజరైన వారు ప్రమాణం చేసి పత్రాలు రాసి ఇచ్చారు. కార్యక్రమంలో కిషన్, రాము, శుభ, అనిల్, సర్వర్ పాషా, రజనీ, రాజేందర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

హసన్‌పర్తి: అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలని డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ పిలుపునిచ్చారు. ప్రతినెల రెండవ ఆదివారం రాజ్యాంగ నిర్మాతకు నివాళి అర్పించే కార్యక్రమంలో భాగంగా హసన్‌పర్తి మండలం కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రౌతు రమేష్ మాట్లాడుతూ కొంతమంది విద్యావేత్తలు కూడా రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆయననే విమర్శించడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య, స్థానిక నాయకులు కనకం రాజు, పోతరాజు ప్రభాకర్, పోతరాజు మల్లికార్జున్, దావ రవి, బొక్క కుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

హన్మకొండ అర్బన్: కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని డీఎస్ఎఫ్, ఏడీఎస్ఎఫ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో దొంగతనం నెపంతో విద్యార్థిని అమానవీయంగా చితకబాదిన ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కాడపాక రాజేందర్, బొట్ల నరేష్ ఉన్నారు.

జనావాసాల్లో ముళ్ల పొదలు

- సంచరిస్తున్న విష పురుగులు
- పట్టించుకోని ఖాళీ స్థలాల యజమానులు, అధికారులు
- భయాందోళనలో స్థానికులు





మడికొండలో ఇళ్ల మధ్యలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని పలు కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దాంతో పందులు, దోమల బెడద ఎక్కువైందని, విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

పందులు, విషపురుగులకు ఆవాసంగా..

డివిజన్‌లోని పలు కాలనీల్లోని ఖాళీ స్థలాలు పందులు, పాములు, దోమలకు ఆవాసాలుగా మారాయి. సదరు యజమానులు ఖాళీ స్థలాల వైపు తిరిగి చూడడం కూడా లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెలవు రోజుల్లో పిల్లలు ఇంటి ముందు పరిసరాల్లో కూడా ఆడుకోవడం లేదని వాపోతున్నారు. మడికొండ, రాంపూర్, టేకులగూడెం, ఉనికిచర్ల తదితర గ్రామాలు నగరాన్ని ఆనుకుని ఉండటంతో చాలా మంది ప్లాట్లు కొనుగోలు చేసి వదిలేశారు. దాంతో అవి చిట్టడవులను తలిపిస్తున్నాయి. ఈక్రమంలో ఖాళీ స్థలాల యజమానులకు గ్రేటర్ మున్సిపల్, కుడా అధికారులు నోటీసులు అందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. దాంతో విష సర్పాలు, పందులు, దోమల బెడద అధికమైంది. ఈ క్రమంలో ఇళ్లల్లో నుంచి బయటికి రావడానికి స్థానికులు జంకుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు అందించి శుభ్రం చేయించాలి.

\- దార ధనుంజయ్, స్థానికుడు

రిటైర్డ్ అధికారుల సంక్షేమమే ధ్యేయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మామునూరు: స్పెషల్ పోలీస్ రిటైర్డ్ అధికారుల సంక్షేమమే అసోసియేషన్ ధ్యేయమని టీఎస్ఎస్పీ పోలీస్ రిటైర్డ్ అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజు ప్రకాశ్, ఉపాధ్యక్షుడు సీహెచ్ సత్తయ్య అన్నారు. ఖిలా వరంగల్ మండలం ఖమ్మం జాతీయ రహదారిలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, కత్తి సమ్మయ్య అధ్యక్షతన టీఎస్ఎస్పీ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం 5వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ పోలీస్ రిటైర్డ్ అధికారుల వ్యక్తిగత ఆరోగ్య భద్రతతోపాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం, టీఎస్ఎస్పీ పోలీస్ రిటైర్డ్ అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇనుగాల జోగిరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎండి.నూరొద్దీన్, ఎండి.సర్వర్, కె.సూరయ్య, కుమారస్వామి, జైందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖాజా, జి.రామ్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

నాయకులపై కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

కాశోజీ సెంటర్ : దళిత బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు యువకులను శిక్షించాలని కోరుతూ ధర్నా నిర్వహించిన క్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలపై బనాయించిన కేసులు ఎత్తివేయాలని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్స్‌కాలనీ పోలీసులు పార్టీ కార్యకర్తలను అరెస్ట్ చేసి మానసికంగా హింసిస్తున్నారని తెలిపారు. ఆ పార్టీ నాయకుడు కుసుమ సతీశ్ మాట్లాడుతూ నిందితుల అరెస్ట్ వివరాలను, నిందితులకు సహకరించిన వారి వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ కార్యవర్గ సభ్యులు రత్నం సతీశ్, సముద్రాల పరమేశ్వర్, అల్లం నాగరాజు, హరిశంకర్, వెంకట్ గౌడ్, బైరి శ్యాం, రజనీశ్, రాజేశ్, రఘునాథ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు ఆర్ట్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్: జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు ఎంపికయ్యారు. జానపద గేయాల పోటీలో ఎనిమిది మంది గ్రూపు విద్యార్థులు ఎంపికయ్యారు. నవీన్, సతీష్‌నాయక్, విజయలక్ష్మి, పావని, నాగరాజు, మీనా, వెంకటేష్, కృష్ణను కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, అధ్యాపకులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మాదాసి కనకయ్య, చందులాల్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను గౌరవించాలి

హసన్‌పర్తి: విద్యార్థులు దేశ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలని విజ్ఞాన కేంద్ర వ్యవస్థాపకులు జగన్ గురూజీ అన్నారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని ఎస్వీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను జగన్ గురూజీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా జగన్ గురూజీని సన్మానించారు. ఎస్వీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కరస్పాండెంట్ జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

హన్మకొండ చౌరస్తా: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మోటార్ వాహనాల చట్టం సవరణ ద్వారా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 20లక్షల మంది కార్మికులు ఆటో, టాక్సీ, గూడ్స్ రంగాల్లో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని వివరించారు. ఉన్నత చదువులు చదువుకున్నా ఉపాధి అవకాశాలు లేక రవాణారంగాన్ని ఎంచుకుంటున్నారని తెలిపారు. రవాణారంగ కార్మికుల సమస్యలపై ఈనెల 8న మధ్యాహ్నం కాజీపేట రైల్వే స్టేషన్, హనుమకొండ బస్టాండ్ అడ్డాల్లో సమావేశం ఉంటుందని అన్నారు. ఆటో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేల్పుల సారంగపాణి, ఓరుగంటి సదానందం, సోమశేఖర్, ఆకుల చక్రపాణి, పరకాల వేణు, శ్రీనివాస్, రాజు, రమేష్, స్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ

నయీంనగర్: అయ్యప్ప నామస్మరణతో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ క్యాంపు కార్యాలయం మార్మోగింది. హనుమకొండ బాలసముద్రంలోని చీఫ్ విప్ కార్యాలయంలో వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో గురుస్వామి, వేద పండితులు రామకృష్ణ శర్మ నేతృత్వంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో దాస్యం వినయ్‌భాస్కర్ – రేవతి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భద్రకాళి దేవాలయ ప్రధాన అర్చకులు శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి నడుం బిగించాలి



అవార్డులు ప్రదానం చేస్తున్న సిరాజుద్దీన్, తదితరులు

విద్యారణ్యపురి: మహాత్ములు బోధించిన శాంతి సందేశాలు, రచనలను చిన్ననాటి నుంచే తెలుసుకుని, ప్రపంచ శాంతికి విద్యార్థులకు నడుం బిగించాలని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకులు మహ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన శాంతి పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాంతిసాధనకు కృషి చేస్తున్న విద్యార్థినులకు బాలశాంతి దూత అవార్డులను ప్రదానం చేశారు. సంస్థ బాధ్యులు, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాంతి, సహనం, ప్రేమ, మంచి లక్షణాలు పెంపొందించాలని ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవార్డుల కోసం 99497 09866 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం పద్మ, ఫౌండేషన్ బాధ్యులు సాగంటి మంజుల, ఉపాధ్యాయులు సుజాత, జ్యోతి, రాములు పాల్గొన్నారు.

కాలభైరవుడికి అభిషేకం

కాశిబుగ్గ: వరంగల్ దయానందకాలనీ కనకదుర్గామాత దేవాలయంలోని స్వర్ణాకర్షణ కాలభైరవుడికి శనివారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం ధనుర్మాసంలో ఆరుద్ర నక్షత్రంలో పౌర్ణమి వచ్చిందని, మరలా ఇప్పుడు రావడంతో కాలభైరవుడికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. అర్చకుడు గంపా శ్రవణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేయూ విద్యార్థి సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు హైకోర్టు తీర్పు మేరకు ఏడు మార్కులు కలపాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలో బీఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబల్ రాతపరీక్షలో ఏడు తప్పుడు ప్రశ్నలు వచ్చాయని, ఈక్రమంలో అభ్యర్థులకు ఏడు మార్కులు కలపాలని తెలంగాణ హైకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. అయినా కూడా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మనోహర్, పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు గోవర్ధన్, విద్యార్థులు అశోక్, శంకర్, బాలాద్రి, సంతోష్, అఖిల, రమ్య, నవ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలి

వరంగల్ రూరల్: మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల క్యాటరింగ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు బొట్ల నరేష్, బీఎస్ఎఫ్ నాయకులు రాజేందర్‌లు కోరారు. ఈ మేరకు శనివారం ఆర్‌సీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్‌సీఓ విద్యారాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాల, కళాశాల క్యాటరింగ్ కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విద్యార్థులకు భోజనం పెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే కాంట్రాక్ట్ రద్దు చేయాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమన్, శ్రీకాంత్, ప్రమోద్, ప్రశాంత్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణన వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న శేషు

నయీంనగర్: జనాభా దామాషా ప్రకారం వాటా కోసం బీసీ జనగణన చేపట్టాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ప్రొఫెసర్ జయశంకర్ పార్కు వద్ద బీఎస్పీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. బీసీ నాయకులు సాయిని నరేందర్, తిరుణహరి శేషు, వడ్లకొండ వేణుగోపాల్, తిరుపతి యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఒకప్పుడు దేశాన్ని పాలించిన బీసీలు నేడు అన్ని రంగాల్లో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జనాభా దామాషా ప్రకారం అవకాశాల కల్పనకు జనగణన లేకపోవడం పెద్ద అడ్డంకిగా మారిందని పేర్కొన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మాదారపు రవి, జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు, నాయకులు బొల్లంపల్లి సారయ్య, పద్మ, సునీల్, రాజేశ్వరి, వినయ్, కిశోర్ పాల్గొన్నారు.

నారికేళ స్వామికి ఘన సన్మానం



రేవంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న శిష్యులు

కాశిబుగ్గ: ఓసిటీలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో నారికేళ స్వామి (18వ సారి అయ్యప్ప మాలధారణ చేసిన) కొమ్ము రేవంత్‌కుమార్‌ను శిష్య బృందం శనివారం సన్మానించింది. ఈ సందర్భంగా రేవంత్‌కుమార్ మాట్లాడుతూ 18సార్లు మాలధారణ చేసినట్లు తెలిపారు. 18వ సారి అయ్యప్ప మాలధారణ చేసి నారికేళ (కొబ్బరి చెట్టు)ను శబరిమలలో అప్పగించేందుకు వరంగల్ నుంచి బయలుదేరి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడెడ్ల సతీష్, చిమ్మని రాజు, డ్యాగల రాజేందర్, పోరండ్ల సతీష్, సునీల్, సకినాల మహేందర్, రవీందర్, శంకర్, సుధాకర్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో రాణించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ పుష్ప

కరీమాబాద్: మహిళలు విద్యావంతులై ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆత్మవిశ్వాసంతో నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతారని వరంగల్ అడిషనల్ డీసీపీ డాక్టర్ కె.పుష్ప అన్నారు. తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే' కార్యక్రమం చైర్మన్ తాళ్ల మల్లేషం అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్నా నేరాలు, ఘోరాలు జరుగుతుండడం బాధాకరమని వాపోయారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకనుగుణంగా విద్యార్థులు సన్మార్గంలో నడవాలని సూచించారు. ఉన్నత విద్యనభ్యసించి ప్రయోజకులు కావాలని పేర్కొన్నారు. క్షణికావేశాలకు లోనుకావద్దని చెప్పారు. పోటీ ప్రపంచంలో ప్రతీ క్షణం విలువైనదేనని గ్రహించాలన్నారు. క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, కళాశాల డైరెక్టర్ తాళ్ల వరుణ్, డాక్టర్ చేతన్‌సింగ్, పుష్ప, సత్యనారాయణ పట్నాయక్, కల్పన, నాగిరెడ్డి, మధుసూదన్, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాలతో విలువల పెంపు



బహుమతి ప్రదానం చేస్తున్న సుధీర్‌కుమార్

హసన్‌పర్తి: సామాజిక శాస్త్రాల అధ్యయనంతో మానవతా విలువలు పెంపొందుతాయని హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ అన్నారు. జిల్లాస్థాయి సాంఘిక శాస్త్రాల ప్రతిభా పాటవ పరీక్షల బహుమతి ప్రదానోత్సవ కార్యకమం భీమారంలోని స్కిల్ స్ట్రోక్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం జరిగింది. జిల్లా విద్యాశాఖ, సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుధీర్‌కుమార్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి.. మానవ జీవన విధానాన్ని ప్రభావితం చేస్తే, సామాజిక శాస్త్రాల వల్ల శాంతియుత, సహకార భావన అలవడుతుందని వివరించారు. ప్రతిభా పాటవ పోటీల ద్వారా విద్యార్థుల్లో అంతర్లీనగా దాగిఉన్న నైపుణ్యాలు వెలికి తీయవచ్చని వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తొమ్మిది మంది ఎంపిక

రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్రం ప్రతిభా పోటీలకు తొమ్మిది మంది ఎంపికైనట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల వేదిక జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్‌హై, క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి రాంకిషన్ రాజు, ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, సిల్క్ స్ట్రోక్స్ డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్‌కుమార్, గాంధీ ప్రతిష్టాన్ అధ్యక్షుడు గిన్నారపు రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు రథంపాణి, సాంఘిక శాస్త్రం ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ హ్యాండ్‌బాల్ జట్టుకు టీషర్టుల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న మహ్మద్ అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 10నుంచి 13వరకు రాజస్థాన్‌లోని కరౌలీలో జరగనున్న 34వ జాతీయ స్థాయి ఫెడరేషన్ కప్‌కు ఎంపికైన తెలంగాణ రాష్ట్ర మహిళా జట్టు క్రీడాకారులకు టీషర్టులను శనివారం పంపిణీ చేశారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ మైదానంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ హాజరై క్రీడాకారులకు టీషర్టులతో పాటు క్రీడా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి తెలంగాణకు పేరు తీసుకురావాలని సూచించారు. గత నెల 28న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కాగా, అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. గత పదిరోజుల పాటు ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం జిల్లా కార్యదర్శి కైలాస్‌యాదవ్, తెలంగాణ టీం కోచ్ బొడ్డు విష్ణువర్ధన్, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కేసీఆర్ కృషి



రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలోని ప్రతీఉద్యోగి సమస్యను సీఎం కేసీఆర్ తన సొంత సమస్యలాగా పరిగణించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, రాయికంటి ప్రతాప్ అన్నారు. నాంపల్లిలోని టీఎన్జీవోస్ భవన్‌లో హనుమకొండ జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులను శనివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు టీఎన్జీవోస్ నేతృత్వంలో పరిష్కారం అవుతాయని చెప్పారు. ఉద్యోగుల తరఫున సంఘం పోరాడుతోందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు కత్తి రమేష్, శ్యాంసుందర్, రామునాయక్, రామినేని శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

మహిళను ఇబ్బంది పెట్టిన వ్యక్తిపై కేసు

కాజీపేట: వివాహితకు సైగలు చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ జి.మహేందర్ రెడ్డి తెలిపారు. దర్గా కాజీపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎండి.ముజీబ్ అనే వ్యక్తి తన ఇంటి ఎదురుగా ఉన్న మహిళకు సైగలు చేస్తూ కొద్దిరోజులుగా ఇబ్బంది పెడుతున్నాడు. కాలనీ పెద్దలకు సదరు మహిళ ఫిర్యాదు చేయగా వారు పిలిచి మందలించినప్పటికీ అతడిలో మార్పు రాకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ చెప్పారు.

ట్యాంపరింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై..

కాజీపేట: వాహనాల నంబర్ ప్లేట్లు ట్యాంపరింగ్ చేసి తిరుగుతున్న నలుగురు వాహనదారులను కాజీపేట పట్టణంలోని ఫాతిమా జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రాపాక గౌతమ్, సభావత్ రాజు, అమర్‌కుమార్ పాశ్వాన్, గంప నితీష్‌పై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య వంచనగిరి రైల్వే గేట్ సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 – 45 ఏళ్ల వయస్సు, 5.5 ఎత్తుగల గుర్తు తెలియని వ్యక్తి.. ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు.

మాంసం విక్రయదారులకు జరిమానా

వరంగల్ అర్బన్: డ్రై డే సందర్భంగా శనివారం మాంసం విక్రయించిన పలు చికెన్ షాపుల నిర్వాహకులకు బల్దియా శానిటేషన్ విభాగం సిబ్బంది జరిమానా విధించి వసూలు చేశారు. నిబంధనలు బేఖాతరు చేస్తూ మాంసం విక్రయాలు చేస్తున్న శాకరాసికుంట, ఖిలా వరంగల్ రోడ్డు ప్రాంతాలకు చెందిన స్నేహ, రమేష్, పవన్ చికెన్ సెంటర్ నిర్వాహకులకు జరిమానా విధించినట్లు సీఎంహెచ్ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవ్యాప్తంగా ప్రతి శనివారం చికెన్, మటన్ దుకాణాలు డ్రై డేను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయాలు జరిపితే జరిమానాలు విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి, షాప్‌లు సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డి, జవాన్లు పాల్గొన్నారు.